
ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు

అమ్మవారికి బంగారు బోనం

చార్మినార్: భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో భక్తులు గురువారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలోని అమ్మవారికి బంగారు పాత్రలోని నైవేద్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బాజాభజంత్రీల నడుమ పోతురాజుల నృత్య విన్యాసాలతో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించారు.





అమ్మోరు జాతర చూద్దాం రండి

భక్తులకు వాడ వాడలా దర్శనం

ఆషాఢమాసం.. బోనాల వైభవం

ప్రారంభమైన ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలు సందడి

ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు.. లక్షల మంది భక్తులకు ఆరాధ్యదైవం...భక్తులు అడిగిందే తడువుగా కోర్కెలు తీర్చే జగన్మాత . ప్రతి ఏడాది ఆషాడ మాసం వచ్చిందంటే ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర కోలాహలం మొదలవుతుంది. మహంకాళి అమ్మవారికి మరో నలుగురు అమ్మవార్లతో కొన్ని దశాబ్దాల నుంచి విడదీయరాని అనుబంధం ఉంది. బోనాల జాతరలో భాగంగా మిగతా అమ్మలతో ఉండే అనుబంధం ఆవిష్కృతం అవుతుంది. ఇందులో జాతరకు ప్రధాన ఘట్టమైన భక్తులకు వాడవాడలో దర్శనం ఇచ్చేందుకు ఘటం మస్తాబయ్యే కర్బల మైదాన్‌లోని నల్లపోచమ్మ, అమ్మవారి పుట్టినిల్లైన న్యూ బోయి గూడ దండు మారెమ్మ, అమ్మవారి ముద్దుల చెల్లి టకారాబస్తీ ఓరుగంటి ఎల్లమ్మ, జాతర పూర్తయ్యాక అమ్మవారికి సాగనంపు చేసి జాతర ముగించే మెట్టుగూడ మహంకాళి అమ్మవారు. ఇలా జాతరలో అమ్మవారికి నలుగురి అమ్మలతో ఉన్న అనుబంధం అందులో జరిగే అపురూప ఘట్టాలు.

\- రాంగోపాల్‌పేట్

కర్బల్ మైదాన్ నల్లపోచమ్మ నుంచి ఎదుర్కోలు ఆషాడ మాసం రెండవ ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఎదుర్కోళ్లు ప్రారంభం అవుతాయి. ఈ ఎదుర్కోళ్లతో జాతర ప్రారంభం అయినట్లు బావిస్తారు. ఈ నెల 7వతేదీన ఎదుర్కోళ్లు ప్రారంభం అయ్యాయి.

చెల్లితో ఆలింగనం... ఒడినింపుకునే అపురూప ఘట్టం

న్యూబోయిగూడలోని పుట్టింటికి వెళ్లే అమ్మవారి ఘటం ముందు టకారా బస్తీలోని చెల్లి ఓరుగంటి ఎల్లమ్మ దగ్గరకు వెళుతుంది. సుమారు గంట పాటు ఇద్దరు ఆనందంతో పరువశిస్తూ ఒకరినొకరు ఆలింగనం చేసుకునే అపురూపఘట్టం అందరినీ ఆకట్టుకుంటుంది.


ఓరుగంటి ఎల్లమ్మ ఘటం

అటు తర్వాత చెల్లి ఓరుగంటి ఎల్లమ్మ అక్కకు ఒడిబియ్యంతో ఒడిని నింపి పుట్టినిల్లు అయిన బోయిగూడకు పంపిస్తుంది. ఈ అక్కా చెల్లెళ్లు ఈ నెల 19వ తేదీన కలుసుకుంటారు.

జాతరకు రమ్మని తల్లి దండు మారమ్మకు ఆహ్వానం...

చెల్లి దగ్గర ఒడి నింపుకున్న అమ్మవారు చూడ చక్కని నా జాతర చూసొద్దువు రావమ్మా అంటూ పుట్టింటికి ఆహ్వానం పలుకడం మరో అపురూప ఘట్టం. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళికి దేవాలయానికి 200 ఏళ్లకు పైబడిన చరిత్ర...దాదాపు 160 ఏళ్ల నుంచి బోనాల జాతర జరుగుతుండగా నాటి తన పుట్టింటి వారికి బోనాల జాతరకు ఆహ్వానం పలికేందుకు న్యూ బోయిగూడలోని దండు మారెమ్మ వద్దకు వెళుతుంది. ఆ రోజు అక్కడే నిద్రించి శనివారం (ఈ నెల 20వ తేదీన) తన పుట్టింటి వాసులైన బోయిగూడ, చుట్టు పక్క బస్తీల వాసుల ఇంటింటికి వెళ్లి జాతరకు ఆహ్వానం చెప్పి తిరిగి అమ్మవారి ఘటం మహంకాళి దేవాలయానికి చేరుకుంటారు.


దండు మారెమ్మ దేవాలయం


ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఘటం

సాగనంపుతో జాతర పరిసమాప్తం

మహంకాళి జాతరలో మరో చివరి ఘట్టం సాగనంపు. సాగనంపుతో జాతర ముగిసినట్లుగా బావిస్తారు. రంగం ముగిసిన తర్వాత అమ్మవారిని అంబారీపై అమ్మవారిని ఉంచి మేళతాళాలు, డప్పులు, వాయిద్యాలు, కోలాటాల మధ్య సాగనంపు కార్యక్రమం చేస్తారు. అంబారీ ముందు ఘటాన్ని ఉంచి భక్తిశ్రద్ధల మధ్య సాగనంపు చేస్తారు. ఈ నెల 21వ తేదీ రంగం రోజు ఈ సాగనంపు జరుగనుంది.


న్యూ బోయిగూడలోని దండు మారెమ్మ

త్వరలో టీఆర్‌టీ పార్కులో ఓపెన్ జిమ్


టీఆర్‌టీ పార్కును సందర్శించిన కార్పొరేటర్ హేమ, అధికారులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ కాలనీలోని పార్కులో స్థానికులకు ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తేనున్నామని స్థానిక కార్పొరేటర్ సామల హేమ చెప్పారు. గురువారం ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పార్కును సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీఆర్‌టీ పార్కులో ఓపెన్ జిమ్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. త్వరలో డివిజన్ పరిధిలోని మరో రెండు పార్కుల్లో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కును అందుబాటులోకి తేనున్నామని చెప్పారు.

సందడిగా వ్యవస్థాపక దినోత్సవం


ఓప్వాస్ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న రాఘవరెడ్డి, మహాపాత్ర తదితరులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ తిరుమలగిరి జయలక్ష్మి గార్డెన్‌లో ఒడియా పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఓప్వాస్) సికింద్రాబాద్ అధ్యక్షులు రష్మీ రంజన్ మహాపాత్ర ఆధ్వర్యంలో రెండవ వ్యవస్థాపక దినోత్సవం గురువారం నిర్వహించారు. కార్యక్ర మంలో గార్డెన్ నిర్వాహకులు సామల రాఘవరెడ్డి, శ్యామల దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చిరువ్యాపారులను ఇబ్బందులకు గురిచేయొద్దు

సనత్‌నగర్: అద్దెలను పెంచి చిరువ్యాపారులను ఇబ్బందులకు గురిచేయవద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్ట మార్కెట్‌లో గల జీహెచ్‌ఎంసీకి చెందిన దుకాణాల్లో వివిధ వ్యాపారాలు చేసుకుంటున్న పలువురు చిరు వ్యాపారులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసం వద్ద కలిసి తమ సమస్యను విన్నవించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు దుకాణాల అద్దె పెంచుతామని నోటీసులు పంపుతున్నారని, అద్దె పెంచడం వల్ల తమకు ఇబ్బందులు తప్పవని వారు ఆవేదన వ్యక్తంచేశారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ త్వరలోనే జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీనిచ్చారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి


హిందూ పబ్లిక్ స్కూల్‌లో ఇన్వెస్టిచ్యూర్ సెర్మనీ వేడుకల్లో విద్యార్థులు, యాజమాన్యం

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో ఇన్వెస్టిచ్యూర్ సెర్మనీ (నాయకత్వ బాధ్యత స్వీకరణ కార్యక్రమం) గురువారం సందడిగా జరిగింది. పాఠశాలలో పలు గ్రూపులకు చెందిన విద్యార్థులకు నాయకత్వ బాధ్యతలను అప్పగించారు. వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బ్యాడ్జీలను ధరింపజేసి బాధ్యతలను కట్టబెట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రూపులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం ద్వారానే జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు త్రిపాఠి, ప్రిన్సిపాల్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా నల్గొండ ఇన్‌చార్జిగా రమేష్

చిలకలగూడ: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నల్గొండ జిల్లా ఇంచార్జీగా సికింద్రాబాద్ చిలకలగూడకు చెందిన ఆకారం రమేష్ నియమితులయ్యారు. ఈమేరకు ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ గురువారం నియామక ఉత్తర్వులను జారీ చేశారు. తెలంగాణలోని 21 జిల్లాలకు ఓబీసీ మోర్చా ఇంచార్జీలను నియమించగా ప్రస్తుతం ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారిగా కొనసాగుతున్న ఆకారం రమేష్‌కు అవకాశం దక్కడం గమనార్హం.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

లాలాపేట: రైతు పక్షపాతి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని రాష్ట్రంలోని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. రూ 2 లక్షల ఏకకాల రైతు రుణమాఫీ చేయడాన్ని తెలంగాణ రైతాంగం హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. ఈ మేరకు గురువారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పనితీరుకు ఇదే నిదర్శనం అని పేర్కొన్నారు.

నిరుద్యోగ డిక్లరేషన్‌ను విస్మరించారు

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరుద్యోగ డిక్లరేషన్‌ను విస్మరించారని ఆర్మూరు ఎమ్మెల్యే పైడి రాజేష్ రెడ్డి అన్నారు. గురువారం ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో నిరుద్యోగ విద్యార్థి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ డా.రుద్రవరం లింగస్వామి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు డా.కాసం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు నిరుద్యోగుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తు విధానాల పై ధ్వజమెత్తారు.

పీజీ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

రసూల్‌పురా: సికింద్రాబాద్ పీజీ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏబీవీపీ నేతలు ధర్నా చేశారు. ఈ క్రమంలో ఏబీవీపీ నాయకులకు మధ్య తోపులాటకు దారితీసింది. కళాశాల గేట్ ముందు ప్రిన్సిపల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేస్తున్న విద్యార్థి నేతలను పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో పర్యటించిన ఎమ్మెల్యే

రసూల్‌పురా: బొల్లారంలోని వివిధ బస్తీల్లో కాలనీల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ గురువారం పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సాయిబాబా దేవాలయం సందర్శించి పూజలు నిర్వహించిన అనంతరం ఓంసాయి కాలనీ వాసులతో సమావేశం అయ్యారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఇళ్ళల్లోకి పాములు వస్తున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌కు ఫోన్ చేసి యుద్ధ ప్రాతిపదికన వీధీ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. బొల్లారం లోని అనేక బస్తీల్లో కాలనీల్లో సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరారు. అనంతరం శిశు అభివృద్ధి కేంద్రంను సందర్శించి వసతుల కల్పనపై ఆరా తీశారు. శిశు కేంద్రం అభివృద్ధికి తాను చేయూతనందిస్తానని హామీచ్చారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీ, బస్తీవాసులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.


ఓంసాయి కాలనీ వాసుల సమస్యలు తెలుసుకుంటున్న శ్రీగణేష్

ఓయూలో రుణమాఫీ సంబరాలు

ఉస్మానియా యూనివర్సిటీ: వరంగల్ డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ రైతుల రుణాల మాఫీ సందర్భంగా ఓయూలో విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో కేక్‌కట్ చేసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి విద్యార్థి నేతలు పాలాభిషేకం షేకం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఓయూ జాక్ చైర్మన్, జేఏసీ వ్యవస్థాపకులు ఓరుగంటి కృష్ణ, ఓయూ జేఏసీ చైర్మన్, కాంఎగ్రెస్ పార్టీ యువ నేత కొత్తపల్లి తిరుపతి, ఓయూ పొలిటికల్ సైన్స్ రిసెర్చ్ స్కాలర్, కాంగ్రెస్ పార్టీ యువ నేత వలిగొండ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టం తేవాలి

బౌద్ధనగర్: గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టం అమల్లోకి తీసుకురావాలని బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ అన్నారు.గురువారం బౌద్ధనగర్ డివిజన్‌లో తెలంగాణ గృహ కార్మికుల దినోత్సవాన్ని తెలంగాణ గృహ కార్మికుల యునియన్ రాష్ట్ర అధ్యక్షురాలు వల్లాల మంజుల అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్, వారాసిగూడ ఎస్ఐ సుదాకర్‌లు మాట్లాడుతూ గృహ కార్మికులు బతుకుదెరువు కోసం ఇళ్లలో పనిచేస్తూ కుటుంబ భారాన్ని మోస్తున్నారన్నారు.

యువకుడి అదృశ్యం

అడ్డగుట్ట: ఇంట్లో చెప్పకుండా బయటి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. తుకారాం గేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. అడ్డగుట్టలోని పెట్రోల్ బంక్ సమీప ప్రాంతంలో నివాసం ఉండే సురేష్ (24) స్థానికంగా ఉన్న విక్టోరియా అపార్టుమెంట్‌లో మెయింటేనెన్స్ బాధ్యతలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18న మధ్యాహ్నం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో అతని భార్య ఉమామహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసికున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రెతిఫైల్ బస్టాండ్ వెనుక వైపు ఉన్న లేన్‌లో గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడివున్నాడన్న సమాచారం మేరకు గోపాలపురం పోలీసులు వెళ్లి చూడగా అప్పటికే మరణించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తింపు కోసం గాంధీ మార్చురీలో భద్రపరిచారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

సనత్‌నగర్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. సీటీఓ జంక్షన్ వద్ద ఓ వ్యక్తి నిర్జీవంగా పడి ఉన్నాడని ఈ నెల 14వ తేదీన బేగంపేట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు అతనిని 108 అంబులెన్స్ వాహనంలో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

టీజీపీసీబీలో ఘనంగా బోనాలు

సనత్‌నగర్: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ప్రధాన కార్యాలయంలో గురువారం బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. టీజీపీసీబీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో మహిళా ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా వచ్చి ప్రత్యేకంగా కొలువుదీరిన అమ్మవారికి సమర్పించారు. పీసీబీ ప్రాంగణమంతా బోనాల ఉత్సవాలతో కోలాహలంగా మారింది.

మహీంద్రా యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ డిజైన్ ఇన్నోవేషన్



సనత్‌నగర్: ప్రతి సెక్టార్‌లోనూ డిజైనింగ్ రంగానికి డిమాండ్ పెరుగుతోందని, ఆ దిశగా సృజనాత్మకత కలిగిన నిపుణులను అందించేందుకు మహీంద్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ డిజైన్ ఇన్నోవేషన్‌ను ప్రారంభించినట్లు ఆ వర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ యాజులు మేడూరి స్పష్టం చేశారు. బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ డిజైన్ ఇన్నోవేషన్‌ను వ్యవస్థాపక డీన్ ప్రొఫెసర్ బీకే చక్రవర్తితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో యాజులు మేడూరి మాట్లాడుతూ మహీంద్రా యూనివర్శిటీ ప్రవేశపెట్టిన కోర్సుల్లో స్కూల్ ఆఫ్ డిజైన్ ఇన్నోవేషన్ కోర్సులు మైలురాయిగా నిలవనున్నాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఏడాది 30 మంది విద్యార్థులతో ఆగస్టు 15 నుంచి బ్యాచిలర్స్ ప్రోగ్రామ్ ఇన్ డిజైన్ తరగతుల నిర్వహణను ప్రారంభించనున్నట్లు వివరించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



అమీర్‌పేట: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం సనత్‌నగర్ డివిజన్ బీకేగూడ రవీంద్రనగర్ ఈఎస్ఐ రోడ్డులో మార్గంలో మొక్కలు నాటారు. రోజు రోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలి


డీసీ సుభాష్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్: బోనాల ఉత్సవాలు జరిగే అమ్మవారి ఆలయాల వద్ద భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మహంకాళి జిల్లా బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి నేతృత్వంలో పార్టీ ప్రతినిధి బృందం జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుభాష్ రావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాల వేడుకలు నిర్వహించే పలు దేవాలయాల వద్ద కనీస వసతులు లేవన్నారు. రహదారులు, డ్రైనేజీ, వరద నీరు సమస్యలు ఆలయాల చుట్టూ నెలకొన్నాయని డీసీ దృష్టికి తెచ్చారు. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలోని ఆలయాల వారిగా నెలకొన్న సమస్యలను డిప్యూటీ కమిషనర్‌కు నివేదించారు. బోనాల జాతర సందర్భంగా మహిళలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, కాంతివంతమైన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ సమస్యలు లేకుండా రహదారులను మరమ్మతు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, పార్టీ నాయకులు కన్నాభిరామ్, అనిత, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ కమిషనర్ సమీక్ష



రాంగోపాల్‌పేట్: ఈ నెల 21,22 తేదీల్లో జరిగే సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర ఏర్పాట్లపై దేవదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు సమీక్షించారు. గురువారం ఆయన ఆర్జేసీ రామకృష్ణ, ఈవో మనోహర్‌రెడ్డి, మహంకాళి ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ పరశురాం తదితరులతో కలిసి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

ఆటా పాటలతో అంగన్‌వాడీ విద్య

లాలాపేట: అంగన్‌వాడీ పాఠశాలల్లో ఆట, పాటలతో కూడిన విద్యను బోధిస్తున్నామని కావునా ప్రజలు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలనీ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య అన్నారు. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు చేపట్టిన అమ్మ మాట- అంగన్వాడి బాట పేరుతో గురువారం శాంతినగర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు.



ఆర్యవైశ్య సంఘం ఆవిర్భావ వేడుకలు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ఆర్యవైశ్య సంఘం 31వ వార్షికోత్సవ వేడుకలు గురువారం సీతాఫల్‌మండి నామాలగుండులోని బీఎస్‌ఆర్ గార్డెన్‌లో జరిగాయి. సంఘం సికింద్రాబాద్ అధ్యక్షుడు పొద్దుటూరి వెంకటేశ్వర్‌రావు (బాబు) ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఆర్యవైశ్యసంఘం జాతీయ నాయకులు నంగునూరి సంపత్‌కుమార్, నాగిళ్ల శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తతం చేస్తామని చెప్పారు.


ఆవిర్భావ వేడుకల్లో ఆర్యవైశ్య ప్రతినిధులను సత్కరిస్తున్న దృశ్యం

ఓయూ విద్యార్థి నేతలపై కాంగ్రెస్ చిన్న చూపు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఓయూ విద్యార్థి నేతలను కాంగ్రెస్ పార్టీ చిన్న చూపుచూస్తోందని బీఆర్‌ఎస్వీ, టీఎస్‌యూ నాయకులు పేర్కొన్నారు. గరువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్గొండ అంజి, బీఆర్‌ఎస్వీ నాయకులు వడ్డేపల్లి సందీప్ కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు.